నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మూసాపేట: లోదా సబ్ స్టేషన్ పరిధిలోని విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎలక్ట్రికల్ ఏఈ భీమ లింగప్ప తెలిపారు. బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కేపీహెచ్‌బీ 7వ ఫేజ్, అంకురా ఆసుపత్రి వెనుక ప్రాంతం, చిట్కో అపార్టుమెంట్, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆర్‌టీఓ కార్యాలయం, కేపీహెచ్‌బీ 4వ ఫేజ్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

పర్యావరణంపై చిన్నారులకు అవగాహన

మోతీనగర్: విద్యార్థులకు బాల్య దశలోనే చదువుతో పాటు పర్యావరణం, సమాజంలో మంచి చెడుల గురించి వివరించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులపై ఉందని బర్డ్స్ అండ్ బ్లూమ్స్ ప్లే స్కూల్ కరస్పాండెంట్ శశిభూషణ్ అన్నారు. బాలాజీ స్వర్ణపురి కాలనీ, మోతీనగర్‌లోని బర్డ్స్ అండ్ బ్లూమ్స్ ప్లే స్కూల్ చిన్నారులను కృష్ణకాంత్ పార్కుకు ప్రకృతిపై అవగాహన కోసం తీసుకెళ్లారు. పార్కు ఆవరణలో ఉన్న పూలు, పండ్లు, చెట్లు, మొక్కలతో పాటు స్విమ్మింగ్ పూల్, వివిధ రకాల చెట్ల గురించి విద్యార్థులకు వివరించారు.

సీపీఐ నాయకుల విరాళాల సేకరణ



బాలానగర్: ఆగస్టు 19 నుంచి 22వ తేదీ వరకు జరిగే సీపీఐ రాష్ట్ర మహాసభల సందర్భంగా శ్రీశ్రీ నగర్‌లో సీపీఐ నాయకులు విరాళాలను మంగళవారం సేకరించారు. మహాసభల విజయవంతానికి ప్రతి ఒక్కరూ చేయూతనివ్వాలని కోరారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి సీపీఐ కార్యదర్శి జి. కృష్ణ, కే. మనోచారి, దావీద్, రాజు గౌడ్, నారాయణ, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

నేడు అమావాస్య అన్న ప్రసాద వితరణ

మోతీనగర్: మోతీనగర్ చౌరస్తాలో జై ఆర్యవైశ్య సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు అమావాస్య అన్నప్రసాద వితరణ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ అన్నదాన కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అత్యవసర వాహనాలకు దారేది?

- రహదారులపై అక్రమ పార్కింగ్
- వాహనాలు వెళ్లలేని పరిస్థితి
- అధికారులు చర్యలు తీసుకోవాలంటున్న పాపిరెడ్డినగర్ వాసులు

ఆల్విన్‌కాలనీ: టౌన్ ప్లానింగ్, ట్రాఫిక్ ఉన్నతాధికారుల పర్యవేక్షణ నిర్లక్ష్యం కారణంగా ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. అసలే ఇరుకైన రహదారులు. ఇంటి నిర్మాణదారులు కాసులకు కక్కుర్తి పడి అనుమతులకు విరుద్ధంగా ఇంటి నిర్మాణం చేపట్టారు. ఇళ్లల్లో పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో ఇరుకైన రహదారులపైనే రోడ్డుకు ఇరువైపులా వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. దీంతో అంబులెన్స్‌కు కూడా దారి లేకపోవటంతో ప్రాణాలు పోయే పరిస్థితి నెలకొంది. మంగళవారం కూకట్‌పల్లి డివిజన్ పాపిరెడ్డినగర్‌లో



కాలనీలో మధ్యలో ఇరుక్కుపోయిన అంబులెన్స్

అనారోగ్యంగా ఉన్న వారిని ఆసుపత్రికి తరలించేందుకు అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అంబులెన్స్ ఆ ఇంటి వద్దకు రావటానికి సుమారు గంట వరకు పాపిరెడ్డినగర్‌లోని ఇరుకైన రోడ్డులోనే సమయం పట్టింది. గుండెనొప్పి, యాక్సిడెంట్ వంటి ప్రమాదకరమైన పరిస్థితి ఉంటే ప్రాణాలు గాలిలో క్షణాల్లోనే పోయే పరిస్థితి నెలకొనేలా ఉందని స్థానికులు వాపోతున్నారు. పగటిపూట అయితే హారన్ కొడితే ఎవరో ఒకరు దారి ఇచ్చే వారు కనిపిస్తారు. రాత్రివేళల్లో అయితే అంతే సంగతులు. ఇలా అనేకసార్లు ఎంతో మందికి అత్యవసర సమయంలో చేతుల మీదనే ఎత్తుకొని వెళ్లి ప్రధాన రహదారిలో అంబులెన్స్‌ను, ఇతర వాహనాలను ఆపి అందులో ఎక్కించి తీసుకెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని స్థానికులు పేర్కొంటున్నారు. కూకట్‌పల్లి టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని, ట్రాఫిక్ పోలీసులు రహదారులపై వాహనాలను పార్కింగ్ చేయకుండా చలానా విధించాలని పలువురు కోరుతున్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ సులభం

మోతీనగర్: సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ మరింత సులభం అవుతుందని కూకట్‌పల్లి ఏసీపీ రవికిరణ్ రెడ్డి అన్నారు. మంగళవారం అల్లాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎస్‌బీఐ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.6 లక్షలతో ఏర్పాటు చేసిన 36 సీసీ కెమెరాలను సీఐ సామల వెంకటరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి బస్తీ, కాలనీల్లో, అపార్టుమెంట్ వాసులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడంతో పాటు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. సమాజంలో అసాంఘిక శక్తులను అరికట్టడంలో ప్రతి ఒక్కరూ యూనిఫాం లేని పోలీసేనని అన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ మహ్మద్ మాజీద్ అలీ, ఎస్‌బీఐ కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు ప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో భవిష్యత్ అంధకారం

మూసాపేట: మాదక ద్రవ్యాల జోలికి వెళ్లి బంగారు భవిష్యత్‌ను అంధకారం చేసుకోవద్దని కూకట్‌పల్లి



ర్యాలీని ప్రారంభిస్తున్న ఏసీపీ రవికిరణ్

ఏసీపీ రవికిరణ్ అన్నారు. మంగళవారం కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్‌ల ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల జోలికి వెళ్లకూడదు అని కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ నుంచి జేఎన్‌టీయూ కళాశాల వరకు పోలీసులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల స్థాయి నుంచి మాదక ద్రవ్యాలకు ఆకర్షితులు అవుతున్నారని, దీంతో బంగారు భవిష్యత్ మొత్తం నాశనం అవుతుందని వివరించారు.

విద్యార్థి నాయకులకు నామినేటెడ్ పోస్టుల్లో అవకాశం కల్పించాలి

బాలానగర్: నామినేటెడ్ పోస్టుల్లో జేఎన్‌టీయూహెచ్ విద్యార్థి నాయకులకు అవకాశం కల్పించాలని పలు విద్యార్థి సంఘాల నాయకులు కోరారు. మంగళవారం జేఎన్‌టీయూహెచ్‌లో జరగిన సమావేశంలో మాట్లాడారు. లక్షలాది మంది విద్యార్థులు జేఎన్‌టీయూతో అనుబంధం కలిగి ఉండి, ప్రభుత్వ, ప్రైవేట్ వ్యాపార రంగాల్లో ఉన్నారని అన్నారు. విద్యారంగ సమస్యలపై ఎన్నో పోరాటాలు నిర్వహించామని గుర్తు చేశారు. సమావేశంలో దిలీప్, తేజ, భానుప్రకాష్, అశోక్ గౌడ్, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మాస శివరాత్రి పూజలు

మోతీనగర్: మూసాపేట డివిజన్, కబీర్‌నగర్‌లోని శివ రామాంజనేయ ఆలయంలో మాస శివరాత్రి సందర్భంగా మంగళవారం పరమేశ్వరుడికి రుద్రాభిషేకం, అన్నాభిషేకం, కాత్యాయని ప్రతంత్యాపన వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



తక్కువ ఖర్చుతో తీర్థ యాత్రలు

మూసాపేట: ఆర్టీసీ ప్రయాణికుల కోసం అతి తక్కువ ఖర్చుతో వివిధ తీర్థ యాత్రలు చూసేందుకు అవకాశాన్ని కల్పిస్తుందని డిప్యూటీ ఆర్‌ఎం అపర్ణ కల్యాణి అన్నారు. లింగంపల్లి, గచ్చిబౌలి నుంచి కాళీమందిర్, బాలాజీ టెంపుల్, అనంతగిరి హిల్స్, ఏకాంతల శ్రీ శనీశ్వర స్వామి ఆలయం చూసుకొని మళ్లీ గచ్చిబౌలికి యాత్ర ఉంటుందని తెలిపారు. పెద్దలకు రూ.350, చిన్నారులకు రూ.200 చార్జి ఉంటుందన్నారు. జీడిమెట్ల నుంచి జోగులాంబ దేవాలయం అలంపూర్, మంత్రాలయం చూసుకొని మళ్లీ జీడిమెట్ల డిపో వరకు యాత్ర ఉంటుందని పెద్దలకు రూ. 1200, చిన్నారులకు రూ.600 చార్జి ఉంటుందన్నారు. కూకట్‌పల్లి నుంచి అనంత పద్మనాభ స్వామి ఆలయం, ముచ్చింతల సమతా మూర్తి ఆలయం, అమ్మపల్లి శ్రీరామచంద్ర స్వామి ఆలయం, వేణికొండ సిద్ధేశ్వర స్వామి ఆలయం చూసుకొని మళ్లీ కూకట్‌పల్లికి యాత్ర ఉంటుందని పెద్దలకు రూ.500, చిన్నారులకు రూ.300 రూపాయలు ఛార్జి ఉంటుందన్నారు. అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలి

ఆల్విన్‌కాలనీ: నాణ్యతా ప్రమాణాలతో సీసీ రోడ్డు పనులు పూర్తి చేయాలని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఈస్ట్ సాయినగర్‌లో నిర్మాణ పనులను మంగళవారం జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈస్ట్ సాయినగర్‌లోని రోడ్డు నెంబర్ 2లో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో రామకృష్ణగౌడ్, సమ్మారెడ్డి, శివరాజ్ గౌడ్, షౌకత్ ఆలీమున్నా, పోశెట్టి గౌడ్, సుధాకర్



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

రెడ్డి, శేఖర్ రెడ్డి, కొండల్‌రావు, అరవింద్, సాయి, ఏఈ శ్రావణి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో నిరసన



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

కూకట్‌పల్లి: ఇరాన్‌పై అమెరికా దాడులు ఆపాలని మంగళవారం హైదర్‌నగర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఎం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి ఎం. శంకర్ మాట్లాడుతూ.. ఇరాన్‌పై అమెరికా దాడులు సరికాదన్నారు. దీనిపై భారత్ వైఖరి స్పష్టం చేయాలని ప్రధాని మోదీని డిమాండ్ చేశారు. అమెరికా దాడులను నిరసిస్తూ దేశవ్యాప్తంగా సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. భారత్‌తో ఇరాన్ ఎప్పుడు స్నేహ పూర్వకంగా వ్యవహరిస్తుందని, కష్ట సమయంలోనూ భారత్‌కు మద్దతిస్తుందని గుర్తు చేశారు. ట్రంప్ నుంచి వచ్చిన ఒత్తిడి కారణంగా మోడీ ప్రభుత్వం ఇప్పుడు అమెరికా వైపు నిలుస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు పి. ధర్మారావు, వి. శివప్రసాద్, నాయకులు రాజారావు, మహేష్ గౌడ్, సదా మహేష్, నరసింహ, సంగమేశ్వర్, శ్రీరాములు, శివశంకర్, జోగారావు, సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

మోతీనగర్: తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని కార్పొరేటర్ సబిహాబేగం, జలమండలి మేనేజర్ అన్విత్ అన్నారు. జనప్రియనగర్, వివేకానందనగర్ రోడ్డు నెంబర్ 8 ప్రాంతాలను మంగళవారం పరిశీలించారు. స్థానికులు తాగునీటి సమస్యను వివరించారు. లో ప్రెషర్‌తో నీటి సరఫరా తగినంతగా లేకపోవడంతో, వారానికి కొన్ని రోజులు నీటికోసం ఎదురు చూడాల్సి వస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులతో చర్చించి లో ప్రెషర్ సమస్యను పరిష్కరించేందుకు అవసరమైన చోట పైపులైన్ మార్పు చేస్తామని, తాత్కాలికంగా ప్రెషర్ పెంచే చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జలమండలి సిబ్బంది గోపాల్ నాయక్, సంతోష్, వెంకటేష్, జ్ఞానేశ్వర్, రవీందర్ రెడ్డి, యోగిరాజ్, శివమ్మ, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.



సమస్య తెలుసుకుంటున్న కార్పొరేటర్ సబిహా బేగం, అధికారులు

పుస్తకం అందజేత

బాలానగర్: హర్యానా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ రచించిన 'ప్రజల కథే నా ఆత్మ కథ' జీవిత చరిత్ర పుస్తక ఆవిష్కరణ కార్యక్రమంలో బాలానగర్, ఫతేనగర్ డివిజన్‌లకు చెందిన పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న పలు పథకాలను ప్రజల్లోకి తీసుకొని వెళ్లాలని సూచించారని నాయకులు తెలిపారు.

